జై వీర హనుమాన్

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు | జై శ్రీరాం నినాదాలతో మార్మోగిన కాలనీలు

హనుమాన్ జయంతిని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. శ్రీరామాలయాలు, హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో, కాలనీలు, బస్తీల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన హనుమాన్ ర్యాలీల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని నినాదాలతో హోరెత్తించారు. – కుత్బుల్లాపూర్


కైసర్‌నగర్‌లో హనుమంతుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద పులిహోర పంపిణీ చేస్తున్న సాక్షి ఏజెంట్స్, హాకర్లు


చింతల్‌లో జరిగిన హనుమాన్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు


కొంపల్లి- దూలపల్లి చౌరస్తాలోని హనుమాన్ ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు


బాచుపల్లిలో బైక్ ర్యాలీ...


కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో ప్రధాన రోడ్డుపై పానియం అందజేస్తున్న ప్రతినిధులు


షాపూర్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్


పద్మానగర్ ఫేజ్-1 గాయత్రి అపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పానకం, ప్రసాదం పంపిణీ


రంగారెడ్డిబండలో కిరణా దుకాణం నిర్వాహకుడు రాజు ఆధ్వర్యంలో..


జీడిమెట్ల డివిజన్‌లో జరిగిన హనుమాన్ పూజల్లో బీజేపీ నేత చెరుకుపల్లి భరతసింహారెడ్డి

వేంకటేశ్వర స్వామి ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్: గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ సుదర్శన, లక్ష్మి, ధన్వంతరి హోమాలు, సకల జనుల క్షేమాన్ని, దేవాలయ శక్తిని ఇనుమడించే సంకల్పంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు మొదలయ్యే పూజల్లో భక్త జనులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ ప్రాంతానికి చెందిన కొడవటి లక్ష్మీ నరసింహకు రూ. 3 లక్షల ఎల్‌వోసీ ఎమ్మెల్యే సహకారంతో మంజూరైంది. ఆ ఎల్‌వోసీని శనివారం చింతల్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు అడప శేషు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక కాలుష్యానికి వ్యతిరేకంగా నేడు నిరసన

నిజాంపేట్: పారిశ్రామిక కాలుష్యానికి వ్యతిరేకంగా ఆదివారం జరిగే నిరసనలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనల విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు ఐటీసీ బొల్లారం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ మద్దతు తెలియజేయాలన్నారు. కొన్ని నెలలుగా తాము పారిశ్రామిక వాయు కాలుష్యాన్ని ఎదుర్కొంటున్నామని తెలిపారు.

శ్రీచైతన్య అకాడమీ టెస్ట్ ప్రిపరేషన్ సెంటర్ ప్రారంభం


టెస్ట్ ప్రిపరేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: శ్రీచైతన్య అకాడమీ టెస్ట్ ప్రిపరేషన్ సెంటర్‌ను శనివారం సుచిత్రలో ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యా సంస్థల సీఈవో సుష్మా బొప్పన, ఇన్ఫినిటీ లెర్న్ వ్యవస్థాపక సీఈవో ఉజ్వల్ సింగ్ మాట్లాడుతూ.. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ వంటి పోటీ పరీక్షలకు నాణ్యమైన ప్రిపరేషన్‌ను విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో పోటీ పరీక్షల్లో రాణించేందుకు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



కుత్బుల్లాపూర్ : శ్రీచైతన్య పాఠశాల నిర్వహించిన ఐఎస్‌టీఎస్‌వో(లెవల్ 2) పరీక్షలో ఎస్సీ నగర్ విద్యార్థులు సత్తాచాటారు. పలు విభాగాల్లో 308 బహుమతులు పొందారు. గ్రాండ్ ప్రైజ్ విజేతగా నక్క పూజితకి(6వ తరగతి) ల్యాప్‌టాప్, మొదటి ప్రైజ్ విజేతగా వడ్డి మోహిత్ సాయికి(8వ తరగతి) ట్యాబ్, మరో మొదటి బహుమతి అమల్ కిరణ్‌సాహుకి ట్యాబ్‌లను అందజేశారు. ఆర్ పద్మజా, ప్రిన్సిపాల్ సుభాషిణి, డీన్ హరికృష్ణ విద్యార్థులను సన్మానించారు.

నేడు ఉచిత వైద్య శిబిరాలు

మోతీనగర్: గాయత్రినగర్ సీనియర్ సిటిజన్ ఫోరం, గాయత్రి నగర్ సంక్షేమ సంఘం, శ్రీ మంజు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. శిబిరంలో గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్స్ డిఎంఠ పల్మనాలజీలకు ఉచిత చికిత్స నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గాయత్రినగర్ పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అదే విధంగా మోతీనగర్ సమీపంలోని కళ్యాణ్‌నగర్ వెంచర్ శ్రీ గౌతమ్ మోడల్ స్కూల్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ధర్మరక్షణకే శక్తిని ఉపయోగించాలి

- ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్
- 21 అడుగుల హనుమాన్ విగ్రహావిష్కరణ

సుభాష్‌నగర్: శక్తిని ఎల్లప్పుడూ ధర్మరక్షణకే వినియోగించాలని, స్వప్రయోజనాల కోసం వినియోగించవద్దని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌గౌడ్ అన్నారు. శనివారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లిలోని హనుమాన్ దేవాలయంలో నూతనంగా నిర్మించిన 21 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రైమార్క్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మించిన దేవాలయ ముఖద్వారాన్ని ఆ సంస్థ చైర్మన్ సాంబశివరావు గారితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ సత్యనారాయణ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, మాజీ సర్పంచ్ బండ నరసింహ, మాజీ కౌన్సిలర్లు భరత్, మైసిగారి వెంకటేష్, సత్యనారాయణ, సగ్గిడి పద్మారావు, శ్రీకాంత్, మైసిగారి శ్రీకాంత్, ఆలయ కమిటీ చైర్మన్ సగ్గిడి శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు సగ్గిడి నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి మైసిగారి వెంకట్ రావు, సంయుక్త కార్యదర్శి మైసిగారి శ్రీకాంత్, రంగా రావు తదితరులు పాల్గొన్నారు.


21 అడుగుల హనుమాన్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

బైక్ ఢీ కొన్న ఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కుత్బుల్లాపూర్: స్నేహితులతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతపురం గ్రామానికి చెందిన రామ్మోహన్‌రావు కుమారుడు షణ్ముఖ్‌నాథ్(20) మైసమ్మగూడలోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతూ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 11వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో తన స్నేహితులు కోటిరెడ్డి, పవన్‌లతో కలిసి గుండపోచంపల్లి సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన పల్సర్ బైక్ షణ్ముఖ్ నాథ్‌ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడటంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పల్సర్ బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను సైతం ఢీ కొట్టడంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


షణ్ముఖ్‌నాథ్(ఫైల్)

బస్ షెల్టర్ ఏర్పాటు చేయరూ!

- బస్సుల కోసం ఎండలోనే ఎదురు చూపులు
- వినతిపత్రాలు ఇచ్చినా స్పందన కరువు

కుత్బుల్లాపూర్: మేజర్ మున్సిపాలిటీ అయిన కొంపల్లి ప్రాంతంలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొంపల్లి నుంచి వెళ్లే రాష్ట్ర, దేశ రాజధానిని కలిపే ఎన్‌హెచ్-44 రోడ్డు నిరంతరం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలలు, జూనియర్, ఇంజినీరింగ్, మెడికల్, బిజినెస్ కళాశాలలు ఉన్నాయి. సుమారు ఐదు వేలకు పై చిలుకు విద్యార్థులు కొంపల్లి బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ వంటి ముఖ్య పట్టణాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కూడా వెళ్లే బస్సులు ఈ రోడ్డు మార్గం ద్వారానే వెళ్తుంటాయి. దూలపల్లి, బొల్లారం, బహదూర్ పల్లి, పోచంపల్లి వంటి పదికి పైగా పరిసర ప్రాంతాల ప్రజలు వారి దినచర్యల్లో భాగంగా ఉద్యోగ, ఉపాధి, వ్యాపార పనుల కోసం రాకపోకలు సాగించాలంటే కొంపల్లి బస్టాండ్ మాత్రమే శరణ్యం. కొంపల్లి జాతీయ రహదారికి ఇరువైపులా ఒక్క షెల్టర్ కూడా లేకపోవడం గమనార్హం. ఎండలోనే బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ఒక పక్క బ్రిడ్జి నిర్మాణ పనులతో ట్రాఫిక్ జామ్, వాహన కాలుష్యం, నిర్మాణ దుమ్ము తదితర సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గతంలో కథనాలు ప్రచురితం కాగా బస్ షెల్టర్ అని బోర్డు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. పన్నుల వసూళ్లపై చూపే శ్రద్ధ అధికారులు బస్‌షెల్టర్ ఏర్పాటుపై కూడా చూపితే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.


బస్ షెల్టర్ లేక ఎండలోనే నిలుచున్న ప్రయాణికులు

అధికారులు పట్టించుకోవడం లేదు



కొంపల్లిలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు కొంపల్లి మున్సిపల్ అధికారులకు, మేడ్చల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రాలు అందజేసినా ఫలితం శూన్యం. సుపరిపాలన అందిస్తున్నామని చెబుతున్న అధికారులు బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు. ఇప్పటికైనా ప్రయాణికుల గోడును పట్టించుకుని బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి. – సతీష్‌సాగర్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు

సీనియర్ జర్నలిస్టు మృతి

కూకట్‌పల్లి: వివిధ ప్రతికలు, పలు టీవీ ఛానల్స్‌లలో పాత్రికేయునిగా పనిచేసిన సీనియర్ జర్నలిస్టు నాగరాజు అనారోగ్యంతో మృతి చెందారు. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన నాగరాజు నెల రోజుల క్రితం లివర్‌కు సంబంధించిన వ్యాధితో కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. నెల రోజుల పాటు చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మూసాపేట: మల్లారెడ్డి హాస్పిటల్ సహకారంతో జనతానగర్ న్యూ అపోస్టిక్ చర్చిలో బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ ప్రారంభించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 350 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో టెక్నాలజీకి సంబంధించిన పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించారు. కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడే వారికి మందులు అందించడమే కాకుండా అవసరమైతే శస్త్ర చికిత్సలకు కూడా హాస్పిటల్ వారితో మాట్లాడి తమ వంతు సహకారం అందిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి హాస్పిటల్ వైద్యులు సాయి కిరణ్, వైష్ణవి, శివప్రసాద్, పి. ఉమా మాధురి, ప్రియాంక, క్యాంపు నిర్వాహకులు అహ్మద్, నాగప్ప, సాయికుమార్, పవన్‌గౌడ్, బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు దాసరి అబ్బాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు మల్లేష్, ఐలయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి రవిగౌడ్, ప్రశాంత్ రెడ్డి, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ మహేందర్ తదితరులు

పట్టని ప్రగతి !

పురపాలిక వార్డుల అభివృద్ధిలో కాలనీవాసుల భాగస్వామ్యం ఉండేలా గత ప్రభుత్వం వార్డు కమిటీలను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు జరిగిన పనుల్లో వీటి భాగస్వామ్యం ఏమాత్రం కనిపించడం లేదు.



- పురపాలిక వార్డులకు కమిటీల ఏర్పాటు
- ప్రతీ వార్డుకు 4 కమిటీలు, మొత్తం 15 మంది సభ్యులు
- పేరుకుపోయిన సమస్యలు, పేరుకే కమిటీలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాలోని 29 పురపాలక సంఘాల్లో 676 వార్డులు ఉండగా, ఇందులో ఉన్న 2,704 కమిటీల్లో 40,560 మంది సభ్యులను ఎంపిక చేశారు. వివిధ పట్టణాల్లో రాజకీయ కారణాలతో కమిటీలు నామమాత్రమయ్యాయి. ఏర్పాటు చేసిన రోజు మినహా సభ్యులను ఇంత వరకు పుర కార్యాలయాలకు పిలిచింది లేదనే విమర్శలున్నాయి. దీంతో వార్డుల్లో అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదు.

ప్రత్యేక దృష్టి అవసరం

పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పట్టణ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యాన్ని గుర్తించిన గత ప్రభుత్వం 2021లో కమిటీలను ఏర్పాటు చేసింది. పట్టణాల్లో వార్డుకు 4 కమిటీలు, ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులను ఎంపిక చేశారు. యువజన సంఘం, సీనియర్ సిటిజన్, మహిళా సంఘం, వార్డు ప్రముఖులతో కలిపి కమిటీని రూపొందించారు.

- ప్రజలతో సంబంధం కలిగిన ఉన్న వారు, విద్యావంతులను కమిటీలో చోటు కల్పించారు. వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో వారి పాత్ర కీలకమనే విషయాన్ని పుర అధికారులు విస్మరించారు.
- పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ, హరితహారం (వనమహోత్సవం), పారిశుద్ధ్యం, నీటిసరఫరా, అక్రమ కట్టడాలను నివారించడం, అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉండటంతో వీరంతా వార్డుకు కావాల్సిన అవసరాలపై పూర్తి స్థాయిలో భాగస్వామ్యాన్ని పంచుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో కమిటీల పనితీరు మెరుగుపడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టణాల్లో సమస్యలివే

పారిశుద్ధ్య పనులు 100 శాతం జరగడం లేదు. మురుగు కాలువలు, సీసీ రహదారుల నిర్మాణాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలాల ఆక్రమణలతో చిన్నపాటి వర్షాలకు లోతట్టు ప్రాంతంలో ఉన్న కాలనీలు, వీధుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. హరితహారం కింద నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోతోంది. చాలా పట్టణాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. ప్రాణాంతక ప్లాస్టిక్ నిషేధంపై చైతన్యం కొరవడి ఎటు చూసినా ఆ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి అంతంతే

శివారు పట్టణాల్లో ముక్కుపిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ.343 కోట్లు వసూలు చేస్తున్నా... పురపాలికలు ప్రజలకు మాత్రం సేవలు అందించడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా పురపాలక సంఘాలకు నిధులు విడుదల అవుతున్నాయి. ఈ నిధులన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నప్పటికీ, పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ కార్పొరేటర్‌లతో శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న రైల్వే లైన్లు, రోడ్లకు సంబంధించి సమస్యలు పరిష్కరించి నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అల్లాపూర్‌లోని యూసఫ్‌నగర్ శ్మశాన వాటిక నుంచి గాయత్రినగర్ వరకు రైల్వే అండర్‌పాస్ లైన్, మూసాపేట నుంచి రాజీవ్ గాంధీ నగర్ వరకు లింక్ రోడ్డు పునరుద్ధరించి, దాని నిర్మాణానికి సంబంధించి గూడ్స్ షెడ్ రోడ్డు నుంచి గ్లాస్ ఫ్యాక్టరీ వరకు రైల్వే అండర్ పాస్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని కోరారు. దీనికి ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, సబిహా బేగం, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, నాయకులు అంబటి శ్రీనివాస్, సత్యం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే